
# ఎవరి ఏడుపు వారిది.

అబ్బూరి ఛాయాదేవి



భోరుమని ఏడవలేదు నేను. కళ్లనీళ్లు కుక్కుకున్నాను. మధ్యమధ్య రుమాలుతో కళ్లు తుడుచుకున్నాను. నా మేనకోడలు నన్ను గట్టిగా పట్టుకుని గుండెలు పగిలేలా ఏడుస్తుంటే దాన్ని నేనే ఓదార్చాను.

నాకు మొదటి నుంచీ - అంటే చిన్నప్పుడు మా బామ్మ చావు చూసినప్పటి నుంచీ ఆశ్చర్యంగా ఉండేది. ఆ పరామర్శ కొచ్చినవాళ్లు అంత వేటుగా ఎలా ఏడుస్తారా అని. మా బామ్మపోతే నాకు 'అయ్యో పాపం' అనిపించింది కాని కళ్లమ్మట నీళ్లు రాలేదు. అంతవరకూ మంచాన పడి ఉన్న ఆవిడకి నానా చాకిరీ చేయలేక అప్పుడప్పుడూ విసుక్కున్న అమ్మ కూడా మధ్య మధ్య ముక్కు చీదుతూ ఏడుస్తూంటే నాకు నిజంగానే ఆశ్చర్యం వేసింది. 'బామ్మ ఎప్పుడు పోతుందా' అని ఎదురు చూసిన ఇంటిల్లిపాదీ, పనివాళ్లతో సహా కళ్లనీళ్లు పెట్టుకున్నారు శవం వెడుతుంటే.

అలా కళ్లనీళ్లు ఎలా వస్తాయో మొదటిసారిగా నాకు అర్థమైంది - చాలాకాలం క్రితం మా వారి స్నేహితుడి భార్య హఠాత్తుగా ఒళ్లు కాలి చచ్చిపోయినప్పుడు. ఆవిడకి ఇద్దరు చిన్నపిల్లలు. వాళ్లని పట్టుకుని ఆవిడ అత్తగారు భోరుమని ఏడుస్తోంది ఏమిటేమిటో గుర్తు తెచ్చుకుంటూ. నాకు కళ్లమ్మట నీళ్లు గిర్రున తిరిగాయి. నేనే ఇలా అయితే - అమ్మా నాన్నగారూ, అత్తగారూ, మామగారూ ఎవ్వరూ దగ్గర లేకుండా - అనే

ఆలోచన వచ్చేసరికి కన్నీళ్లు ఉబికి వచ్చాయి. నన్ను ఆ స్థితిలో ఊహించుకుంటే దుఃఖం వచ్చింది.

ఎప్పుడో ఒక మహానటి అలాంటిదే చెప్పింది - 'గ్లిజరిన్ లేకుండా అంత గొప్పగా ఏడుస్తూ ఎలా నటించగలుగుతారు?' అని ఒక విలేఖరి అడిగితే, 'ఈ స్థితిలో నేనే ఉంటే, ఇది నాకే జరిగితే' అనే ఊహ తెచ్చుకుంటే చాలు, కన్నీళ్లు వాటంతట అవే వస్తాయి' అని సునాయాసంగా నవ్వుతూ సమాధానం చెప్పింది. తత్త్వజ్ఞానులు చెప్పేది కూడా 'నేను, నాది, నాకు' అనుకోవడమే దుఃఖానికి మూల కారణం అని కదా!

నాకు ఇదొక పరిశోధనాంశం అయిపోయింది! ఎవరిని పరామర్శ చేయడానికి వెళ్లినా, అక్కడ ఎవరెవరు ఎలా ఏడుపు మొహాలు పెడుతున్నారో, ఎలా ఏడుస్తున్నారో, ఏమేం మాట్లాడుతున్నారో - అన్నీ గమనించడం ఒక అలవాటయిపోయింది. అంతేకాదు, మరణంతో పరిచయం, సాన్నిహిత్యం ఏర్పడినట్లయి, నాకు దగ్గరనుకున్న వాళ్లందరిలో ఎవరు పోతే నాకు ఎలా అనిపిస్తుందో ఊహించుకునేదాన్ని అనాలోచితంగానే, అప్రయత్నంగానే అటువంటి ఆలోచనలు వచ్చేవి. దాంతో, మరణం ఒక నిత్య వాస్తవంలా తోచేది.

దానికితోడు కృష్ణమూర్తిగారి 'జిడ్డు' కొంత ఒంటబట్టి, మరణం అన్నా ఒంటరితనం అన్నా భయం పోయి, అవగాహన ఎక్కువైంది.

అందుకే నా జీవన సహచరుడు పోయిన సమయంలో కూడా భోరున ఏడవలేకపోయాను. ఏదో చెప్పలేని నిర్లిప్తత ఆవహించింది. నిర్లిప్తత అంటే స్తబ్దంగా అయిపోలేదు మళ్లీ. పైగా, నోరు మూసుకుని ఏడవడం లేకపోగా, వాగుడెక్కువైంది.

ఎవరైనా పరామర్శకొచ్చి, 'ఎలా పోయారు?', 'ఆఖరున ఏమైనా మాట్లాడారా' వంటి ప్రశ్నలు వేస్తూ ఆయన గురించి 'మరణ కుతూహలం' చూపించగానే మొత్తం కథంతా చెప్పుకొచ్చేదాన్ని - మధ్యలో వాళ్ల ప్రశ్న లన్నింటికీ సమాధానాలు చెపుతూ. నా నోరు తడారిపోయి, పెదిమలు బిగదీసుకుపోతున్నా కథ ఆపేదాన్ని కాదు. వాళ్లు వెళ్లిపోయాక మా పెద్దాడపడుచు ఒకటి రెండుసార్లు అన్నారు కూడాను - "సు వ్వెందు కదంతా చెప్పడం? రెస్టు తీసుకో! ఇక్కడున్నవాళ్లం ఎవరో ఒకరం చెబుతాంలే!" అని. వచ్చిన వాళ్లు నన్నే అడిగేవారు నా పక్కన కూర్చుని. మళ్లీ నేనే చెప్పేదాన్ని.

ఎవరైనా డోర్ బెల్ నొక్కితే చాలు, అలవాటు చొప్పున చటుక్కున కూర్చున్న చోటు నుంచి లేచేదాన్ని తలుపు తీయడానికి. 'బొందాం పెళ్లికూతురి'లా. నన్ను భుజాలు పట్టుకుని మా ఆడపడుచే, తోటికోడలో ఎవరో ఒకరు కూర్చోపెట్టాల్సివచ్చేది - "నువ్వుండు, మేం వెళ్లి తీస్తాంలే" అంటూ. దుఃఖంతో ఓ మూల కూర్చునో, పడుకునో ఉండాలన్న జ్ఞానం లేకుండా నేను - ఎవరైనా మొత్తం డబ్బు కావాలంటే నేనే బీరువా తెరిచి ఇచ్చేదాన్ని ఇంట్లో ఏ వస్తువు కావాలన్నా తెలియని వాళ్లకి లేచి చూపించవలసివచ్చేది. ఆచారం ప్రకారం ఓ మూల కూర్చుంటానంటే ఎలా కుదురుతుంది? ఇంటి కెవరో ఒకరు ఏదో ఒక సమయంలో పరామర్శకి వస్తూనే ఉన్నారు.

నాకు కొన్త మార్పుగా ఉంటుందని ఓ రోజున వాళ్లింటికి రమ్మన్నారు మా పెద్దాడపడుచు.

"వద్దండీ! ఇంటి కెవరైనా వస్తే, నేను లేకపోతే బాగుండదు!" అన్నాను.

మా రెండో ఆడపడుచు వెంటనే అందుకుని, "ఇవాళ ఎవరూ రారులే వదినా! మంగళవారం, శుక్రవారం పరామర్శలకి రారు. నీకు సెలవు దినాలు!" అంది చిరునవ్వుతో. తనతోబాటు నేనూ చిరునవ్వు నవ్వకుండా ఉండలేకపోయాను.

ఆ మర్నాడు మా దూరపు బంధువు లెవరో పరామర్శ కొస్తే అందరం సావిట్లోనే కూర్చున్నాం కుర్చీల్లో. చాపలూ, జంబుఖానాలూ వెయ్యలేదు. ఈ రోజుల్లో అందరికీ నేలమీద కూర్చునే అలవాటు తప్పిపోతోంది కదా! పైగా, ప్రతివాళ్లకీ మోకాళ్ల నొప్పులూ, నడుం చొప్పులూను. అంచేత పరామర్శకొచ్చిన వాళ్లని కుర్చీల్లోనే కూర్చోపెడుతున్నాం. నాకూ నడుం నొప్పే కదా! నేనూ 'తఖ్తె' మీదో, కుర్చీలోనో కూర్చునే మాట్లాడుతున్నాను.

ఆ సమయంలో ఒకాయ నెవడో వచ్చాడు పరామర్శకి. ఆయ నెవడో నాకు తెలియదు. మా వా ళ్లెవరికీ తెలిసినాయన కాదని తెలుస్తోంది వాళ్ల మొహాలు చూస్తే. మే మెవరం కూర్చోమనకుండానే, గుమ్మం దగ్గరే ఉన్న ఓ కుర్చీని బర్రున ముందుకి లాక్కుని కూర్చున్నాడు.

"నన్ను గుర్తుపట్టలేదా? నేను, భీమారావుని!" అన్నాడు. నేను తలెత్తి తెల్లబోయినట్లు చూశాను. అత నెవరో నాకు గుర్తు రాలేదు.

"నేనూ, భీమారావుని! చిన్నప్పుడు మనం కలిసి చదువుకున్నాంగా!" అన్నాడు పెద్ద గొంతుతో. ఆ గొంతుకీ, ఆ అన్న తీరుకీ నాకు సిగ్గనిపించింది.

"సారీ, గుర్తు లేదండీ!" అన్నాను నసుగుతూ.

"అదేమిటీ, గుర్తు లేకపోవడమేమిటి? అలా ఎలా మరిచిపోయావు?" అన్నాడు.

ఆ ఏకవచన ప్రయోగానికి గతుక్కుమన్నాను. మా ఆడపడుచులూ, ఇతర బంధువులూ ఏమనుకున్నారో అన్నట్లు ఓ క్షణం వాళ్ల వైపు చూసి తలవంచుకున్నాను ఏమనాలో తెలియక. వాళ్లంతా ఎలా కలగజేసుకోవాలో తెలియనట్లు మౌనంగా చూస్తున్నారు.

"పోనీ, రాధ గుర్తుందా?" అన్నాడు మళ్లీ.

"ఏ రాధ?" అన్నాను సందేహంగా. ఇద్దరు రాధ లుండేవారు నా స్నేహితురాళ్లు - ఒకళ్లు హైస్కూలులోనూ, ఒకళ్లు కాలేజీలోనూ.

"అదీ! రాధనే మరిచిపోతే ఇక నేనేం గుర్తుంటానూ?" అని దీర్ఘం తీశాడు.

'ఇదెక్కడి మేళంరా బాబూ!' అనుకుని, నిస్సహాయంగా చూశాను మా ఆడపడుచులవైపు - నా కేం తెలియ దన్నట్లు. వాళ్లు అతని వాలకం గ్రహించి నవ్వాపుకుంటున్నట్లు చెబుతున్నాయి వాళ్ల ముఖాలు. నేను నవ్వలేను, మింగలేను.

"ఏమిటీ, మీ ఆయన ఆసుపత్రిలో పోయాట్టగా! ఏం జబ్బు చేసి పోయా డేమిటి?" అన్నాడు.

ఆ మోటు ప్రశ్నకి సమాధానం వివరంగా చెప్పబుద్ధి కాలేదు. అసలు జవాబే చెప్పబుద్ధి కాలేదు. తలొంచుకున్నాను మొదటిసారిగా. దుఃఖంతో నా గొంతు పూడుకుపోయిం దనుకున్నారేమో మా వాళ్లు, మా మరిది



## వేటూరి చమత్కారాలు

ప్రముఖ సినీ గీత రచయిత శ్రీ వేటూరి సుందరరామమూర్తి హైదరాబాద్ వివిధ భారతి వాణిజ్య ప్రసార విభాగంలో ప్రత్యేక జనరంజని కార్యక్రమాన్ని సమర్పిస్తూ, "ఇక్కడ వర్షాలు కొంచెం కొంచెంగా పడటం మొదలైంది. అదేంటోకానీ, 'మాన్‌సూన్' మద్రాసులో ఎప్పుడూ ఆలస్యమే. అక్కడ మాన్ 'లేట్' అంటే బాగుంటుందేమో" అని ఓ 'ఫన్' విసిరి 'ఆకాశ దేశాన ఆషాఢమాసాన' అనే మేఘసందేశం పాటతో కార్యక్రమం ప్రారంభించారు.

ఆయన ఇదే కార్యక్రమంలో మాట్లాడుతూ, 'మళ్లీ మళ్లీ ఇది రాని రోజు' అనే పాటను సుహాసిని తనను ఎప్పుడు చూసినా గుర్తు చేస్తుందని చెప్పి, "ఇప్పుడు మీకు ఆ పాట వినిపిస్తాను. సినిమా పేరు చెప్పనులెండి భయపడతారు" అని చమత్కరించారు [ఈ పాట 'రాక్షసుడు' సినిమాలోది కదా మరి!]

చమత్కారంగా మాట్లాడటంలో వేటూరి నిపుణుడు. ఈమధ్య ఆయన ఓచోట గీత రచయిత 'పంచభర్తృక'లాంటివాడని చెప్పారు. "నిర్మాత, దర్శకుడు, సంగీత దర్శకుడు, సెన్సార్ సభ్యులు, ప్రేక్షకులను దృష్టిలో పెట్టుకుని పాటలు రాయాలి కదా! అందుకే మరి!" అని ఆయన చమత్కరించారు.

సేకరణ: భమిడిపాటి వెంకటేశ్వరరావు [చందానగర్]

కలగజేసుకుని చెప్పాడు వ్యాధి ఏమిటో.

"ఊహూ" అన్నాడు మూలిగినట్లు. కాసేపు నిశ్శబ్దంగా ఇటూ అటూ చూశాడు.

"మీ ఆయన నేవో పుస్తకాలు రాశాట్టగా? ఏమైనా అమ్ముడుపోయాయా?" అన్నాడు. అతని నోట్లో ఎన్ని పళ్లు ఊడిపోయాయో చూచాయగా కనిపించింది అత నా ప్రశ్న అడుగుతున్నప్పుడు.

ఆ ప్రశ్నకు నాకు నవ్వాలో, ఏడవాలో అర్థం కాలేదు. ఇన్ని చావులూ, పరామర్శలూ చూశాను కాని, ఇటువంటి పరామర్శ అనుభవంలోకి రావడం ఇదే. ఈ శాల్తీని ఎలా వదిలించుకోవడమా అనే ఆలోచనలో పడిపోయి నేను మాట్లాడలేదు. మా మరిదే ఏదో యథోచితంగా సమాధానం చెప్పాడు.

ఎలాగైనా నన్ను మాటల్లో పెట్టాలన్నట్లు - "పోనీ, హైమావతి గుర్తుందా?" అని అడిగాడు.

"ఊఁ" అన్నట్లు తల ఊపాను ఏమంటాడో చూద్దామని.

"ఇంకా పెళ్లి కాలేదు తెలుసా?" అన్నాడు.

నేను బుర్ర అడ్డంగా ఊపాను తెలియ దన్నట్లు.

"అన లేమైందంటే ..." అంటూ ఏదో గ్రంథం విప్పబోతుంటే, అదృష్టవశాత్తు ఎవరో మిత్రులు వచ్చారు పరామర్శకి. దాంతో అతనికి లేవక తప్పలేదు. 'బతుకు జీవుడా' అనుకున్నాను. ఆ రాత్రి పడుకోబోయే ముందు అతన్నీ అతని మాటల్నీ తలుచుకుంటూ అందరం ఒకటే నవ్వు. అంత నవ్వులోనూ, మళ్లీ ఎప్పుడైనా వస్తాడేమో నన్న భయం నా మనసులో మెదిలింది.

రెండవ నెలంతా పరామర్శలు దాదాపు లేవనే చెప్పాలి. ఇంతకుముందు వచ్చిన బంధుమిత్రులే కొందరు వచ్చి పలకరించి పోతూండేవారు. మొదటి నెలలో చూడకపోతే, మూడవ నెలలో తప్ప పరామర్శకి వెళ్లకూడదన్న ఆచారం ఇంకా చాలామంది పాటిస్తున్నారన్న విషయం తెలిసొచ్చింది.

కొన్నాళ్లు పోయాక, అంతా సర్దుమణిగి, నేను ఒంటరి జీవితానికి అలవాటు పడుతున్న సమయంలో ఒక సాయంత్రం ఆరూ ఆ ప్రాంతాల్లో ఆ భీమారావు మళ్లీ వచ్చాడు. తలుపు తీశాక లోపలికి రమ్మనకుండా ఎలా ఉండటం? ఇదివరకులాగే గుమ్మం దగ్గరున్న సీటులోనే కూర్చున్నాడు. నేను ఎదురుగా కొంచెం దూరంలో ఓ కుర్చీలో ఒదిగి కూర్చున్నాను - ఏమని అడుగుతాడో ఈసారి అని సంకోచిస్తూ.

"ఊఁ" అంటూ అటూ, ఇటూ చూసి, "ఒక్కర్తివే ఉంటున్నావా?" అన్నాడు.

ఆ ప్రశ్న వెనక జాలివంటి భావం ఏమీ స్ఫురించలేదు.

అవునన్నట్లు బుర్ర ఊపాను.

"మంచినీళ్లు కావాలా?" అని కూడా అడగలేదు నేను. బిగుసుకుపోయినట్లు కూర్చున్నాను.

మళ్లీ ఇటూఅటూ చూసి, తరువాత మధ్య బల్లకేసి చూసి, "పేపర్లు తెప్పిస్తున్నావే!" అన్నాడు.

"అవును. కాలక్షేపానికి" అన్నాను. అంతకంటే ఏమంటాను.

."ఊఁ" అని మళ్లీ దీర్ఘం తీసి, "ఎవరినీ పెంచుకోలేదేం ఇన్నాళ్లూ?" అన్నాడు. నా గురించి చాలా వాకబు చేసినట్టున్నాడు.

"మా కిష్టం లేక!" అన్నాను ముక్తసరిగా.

"రెండో పూట తింటున్నావా?" అన్నాడు.

నేను సరిగ్గా భోజనం చేస్తున్నానా, లేదా అని ఆప్యాయంగా అడిగినట్లు లే దా ప్రశ్న. అరా తీస్తున్నట్లుగా ఉంది. బుర్ర ఊపాను. మన సమాజంలో ఇప్పటికీ ఇంకా ఎంతమంది ఉన్నారో ఇలాంటి ఆలోచనలున్నవాళ్లు - అనుకున్నాను మనసులో.

హాల్లో ఉన్న 'తఖ్తా' కేసి చూస్తూ, "సావిట్లో మంచం ఎందుకు వేశావు?" అన్నాడు.


క్షణం సేపు నిర్ఘాంతపోయాను ఆ ప్రశ్నకి. నేను సమాధానం చెప్పేలోపే అతనే -

"ఓహో! మార్వాడీ వాళ్లలా పొడుగు తలగడాలు కూడా వేశావే!" అన్నాడు అదే రకపు చిరునవ్వుతో.

నేను మాట్లాడలేదు. అలా రెండు నిముషాలు నిశ్శబ్దం పాటించేసరికి ఇక లాభం లేదనుకున్నాడేమో, లేచి నుంచుని "సరే, వెళ్తాను మరి!" అన్నాడు.

"మంచిది" అని తలుపు వేసుకున్నాను.

ఈమధ్య ఇంట్లో వెనకవైపు గది అద్దెకిచ్చాక అక్కడున్న సామాను తక్కి గదుల్లో సర్దాల్సివచ్చింది. ఇంకో పడుకునే పెద్ద బల్ల ఉంటే దాన్ని తీసుకొచ్చి ముందు హాల్లో వేసి, దాని మీద కూడా దుప్పటీ, దిళ్లూ వేశాను అందంగా. వేస్తున్నప్పుడు అనుమానం వచ్చింది - ఈసారి మళ్లీ ఆ భీమారావు వస్తే 'రెండో మంచం కూడా వేశావేం?' అంటాడేమో అని. ఆ ఆలోచన రాగానే అతన్ని ఏడిపిస్తున్నట్లు అనిపించి నవ్వొచ్చింది నాకు. ●



హెచ్చరిక !

"కోర్టులో ఎవరైనా గొడవ పెడితే కోర్టు నుండి బహిష్కరిస్తాను జాగ్రత్త!" హెచ్చరించాడు జడ్జి.

"అయితే నేను గొడవ పెడతాను సార్" అన్నాడు బోనులో ఉన్న ఖైదీ.

ఎం.రాము [అల్లినగరం]

